పార్వతీపురం మన్యం

డోలీ మోతల్లేని గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాలాంధ్ర - కురుపాం: రాష్ట్రంలో డోలీ మోతల్లేని గిరిజన గ్రామాలుగా అన్ని గిరి శిఖరాలకు నాణ్యమైన రహదారి నిర్మాణం కూటమి ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా పని చేస్తుందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని జి.శివడ పంచాయతీలో నూతనంగా 3.90 కోట్లుతో నిర్మించిన జి.శివడ-రాముడు గూడ, రాముడు గూడ-కీడవాయి బి.టి రహదారులను రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్‌లతో ప్రారంభించారు. సంధ్యా రాణి మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో సరైన రహదారి సౌకర్యాలు లేకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో పడుతున్న ఇబ్బందులను గుర్తించి అన్ని ప్రాంతాల్లో గిరిశిఖరానికి రహదారులను నిర్మించి డోలీ మోతల్లేని గోదావరి గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. అన్ని గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రక్షిత మంచినీటి పథకాలు నిర్మాణం చేసి త్రాగు నీటి సమస్య పరిష్కరి స్తామని తెలిపారు. 156 కోట్ల రూపాయలతో గిరిజన సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు ప్లేటు, గ్లాసులు, పెట్టె దుప్పట్లు త్వరలో పంపిణీ చేస్తామన్నారు.

కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, మాజీ జడ్పీ చైర్మన్ సుదర్శన్, వెంకటనాయుడు, అరకు పార్లమెంట్ కార్యదర్శి డొంకాడ రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్, సర్పంచ్ మిన్నారావు, తహశీల్దార్ రవణమ్మ, ఎంపీడీవో ఉమా మహేశ్వరి, గిరిజన సంక్షేమ ఈఈ మణి కుమార్, డిఈఈ చాణక్య, ఏఈఈ అప్పారావు పాల్గొన్నారు.

దళితుల భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి

విశాలాంధ్ర - సీతంపేట: భామిని మండలం, లివిరి గ్రామ దళిత భూములను కబ్జాదారుల నుండి రక్షించి గ్రామ ప్రజలకు ఇప్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భామిని మండల కేంద్రంలో మన్మధరావు మాట్లాడుతూ ఆనాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం, నాడు 1984లో అసైన్డ్ భూములను భామిని మండలం, లివిరి గ్రామానికి చెందిన దళితులకు ఇచ్చిందని, అయితే ఆ భూములపై కొంతమంది భూ కబ్జాదారులు కన్నేసి ఆ అసైన్డ్ భూములు ఆక్రమణ చేసి రైతులను మభ్యపెట్టి ఆనాడు కౌలు కింద తీసుకొని ఇప్పటికీ వాళ్ల భూములు వాళ్ళకి అప్పజెప్పకుండా వాళ్ల చేతనే చాకిరి చేయించుకొని ఆ భూ కబ్జాదారులు ఆ భూములను దర్జాగా అనుభవిస్తున్నారన్నారు. అయితే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా సరే ఈ లివిర గ్రామ దళిత ప్రజలు వాళ్ల భూములపై ఎటువంటి స్వాతంత్రపు హక్కు లేకుండా జీవిస్తున్నారన్నారు. దీనిపై సీపీఐ నాయకులు భామిని మండల ఎమ్మార్వో దృష్టికి శుక్రవారం తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వాళ్ల భూములు వాళ్లకి ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ భామిని మండల కార్యదర్శి గుజ్జ జనార్ధన, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కూరంగి గోపినాయుడు, అల్లిబోయిన అప్పలనాయుడు, గ్రామస్తులు సిహెచ్ రాములు, ఎస్.నానాజీ, పి.జమ్మయ్య, బాలు, యూ.చార్లెస్, కృష్ణారావు, చిన్నారావు, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు అన్నపూర్ణ పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు నిధులు ఇప్పించరూ...

గిరిజన శాఖ మంత్రికి రైతుల విన్నపం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు నిధులు ఇప్పించాలని కోరుతూ రైతులు గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణికి వినతి అందజేశారు. శుక్రవారం గిజబ జంక్షన్ వద్ద ఆమెను కలిసి తోటపల్లి ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు నిధులు మంజూరు చేసి ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ కిడారి శ్రావణ్ కుమార్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి మరడాన తవిటి నాయుడు, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలో ఉన్న రైతులందరితో కలిసి గత టీడీపీ మంజూరు చేసిన తోటపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు పల్ల రాంబాబు, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిది నందివాడ కృష్ణబాబు, ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మూడడ్ల సత్యం నాయుడు, నియోజకవర్గ వెలమ సాధికార సమితి అధ్యక్షులు రెడ్డి బలరాం స్వామినాయుడు, ఒట్టిగెడ్డ ప్రాజెక్టు వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్, గరుగుబిల్లి టీడీపీ సీనియర్ నాయకులు నారాయణస్వామి నాయుడు, జియ్యమ్మవలస మండల టిడిపి సీనియర్ నాయకులు జోగి భుజింగరావు, పూడి సీతారాంనాయుడు, గిజబ ఎంపీటీసీ సభ్యులు మరడాన సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

ఆశీల వసూళ్లు నిలుపుదల చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి వసూలు చేస్తున్న అనధికార ఆసీల వసూళ్లను నిలుపుదల చేయాలని సీపీఐ పార్వతీపురం జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్ కోరారు. ఆశీల వసూళ్ల నిలుపుదల చేయమని వినతి పత్రం అం దించేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఆ వినతి పత్రాన్ని మేనేజర్‌కు, రెవెన్యూ అధికారికి ఇచ్చేందుకు వెళ్లగా వారు వినతిపత్రాన్ని చదివి, తీసుకునేందుకు నిరాకరించడంతోపాటు మంగళవారం రండి అని సలహా ఇవ్వటంతో ఆ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శైలజకు వినతి అందజేయడం జరిగిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతి ఏదైనప్పటికీ సంబంధిత అధికా రులు వినతిపత్రం స్వీకరించేందుకు నిరాకరించటం ఎంతవరకు సమంజస మన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మార్చి 19వ తేదీన రోడ్డు మార్జిన్ ఆశీల వేలం పాట నిర్వహించి ఉన్నారని పాట అనంతరం పాలకవర్గ ఆమోదం గాని, మున్సిపల్ చైర్ పర్సన్ ముందస్తు అనుమతి గాని లేకుండా సదరు వ్యక్తికి మౌఖికంగా ఆశీల మార్కెట్లో వసూలు చేసుకోమని ఆదేశాలు జారీ చేసియున్నారని ఇది మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని ఈ విషయాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోం దన్నారు. ఇప్పటికైనా అనధికారికంగా చేపడుతున్న వసూళ్లను నిలుపుదల చేసి పాలకవర్గం ఆమోదం పొందే వరకు కార్యాలయ సిబ్బందితో ఆశీల వసూళ్లను చేపట్టాలని, లేనియెడల ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి సీపీఐ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - బెలగాం: ఎఐకెఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో ఏఐకెఎస్ 30వ జాతీయ మహా సభలు తమిళనాడు రాష్ట్రం నాగ పట్నంలో జరుగుతున్నాయని ఈ మహా సభలలో వ్యవసాయ విధానంలో వస్తున్న మార్పులను, రైతు వ్యతిరేక చట్టాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ఈవి నాయుడు, కోశాధికారి బొత్స గౌరు నాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య, యువజన సంఘం నాయకులు బిటి నాయుడు, విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ ఉన్నారు.

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం చలివేంద్ర గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పోరెడ్డి స్వామి నాయుడు ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు మాట్లాడుతూ ఏఐకేఎస్ ఆర్థిక సాంఘిక దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతంలో పెద్ద ఎత్తున చైతన్యం నింపి ఉద్యమంలోకి రైతన్నను తీసుకు రావడంతో భారతదేశ స్వతంత్ర ఉద్యమం మరో కీలక మలుపు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గ్రామ నాయకులు అలజంగి అప్పల స్వామి నాయుడు, కోడూరు శ్రీనివాస రావు, గర్భాన తవిటి నాయుడు, సీమల అన్నం నాయుడు, బొత్స పాపి నాయుడు, గొట్టాన సత్యం నాయుడు, రాజాన రాజా రావు, పోరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

నిరుపేదలకు పక్కా గృహాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: దశాబ్దాలుగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులతో కలిసి నివసిస్తున్న ఓసి, బిసి, ఎస్సీ నిరుపేదలకు ప్రధాని ఆవాస యోజనలో భాగంగా పక్కా గృహాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని ఏజెన్సీ కాపు సంఘ అధ్యక్షుడు కొనిశ మన్మథరావు ఆధ్వర్యంలో బిసి నాయకులు గిరిజన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల చైర్మన్ సొంటేన రాజేష్, నితీష్, చారి తదితరులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

విశాలాంధ్ర - బలిజిపేట: స్మార్ట్ మీటర్లు రద్దు చేసి కరెంట్ చార్జీలు తగ్గించాలని సీపీఎం మండల నాయకులు బొద్దాన భానుమూర్తి, నల్ల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలు వేసే స్మార్ట్ మీటర్లపై ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలనే గోడపత్రికలను ఆవిష్కరించారు. ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించాలని, సెకీ ఒప్పం దాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ, మండల నాయకులు యమ్మల మన్మధరావు, పీస వెంకటస్వామి, పాలీల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర - పాచిపెంట: మండలంలో రాయి గుడ్డి వలస పంచాయతీల్లో గల రాయి గుడ్డి వలస, చుట్టుపక్కల గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ గృహ నిర్మాణ పనులను, చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టే విధంగా సంబంధిత గృహ నిర్మాణ శాఖ అధికారికి ఆదేశించారు. ప్రతి ఒక్కరూ గ్రామపంచాయతీలో చెత్తను పొడి తడి చెత్తను వేరు చేసి చెత్త ద్వారా సంపద తయారు చేయవచ్చని అన్నారు. ఈయన వెంట ఎంపీడీవో బివిజె పాత్రో పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రతీ మండలంలో నెలకు 1,000 గృహాలు పూర్తిచేయాలని లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, కనీసం 500 గృహాలైన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మే నెలలోగా 1600 గృహాలు పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ప్రతి మండలంలో వారానికి 100 గృహాలు పూర్తయితే గాని అనుకున్న లక్ష్యాలను సాధించలేరని తేల్చి చెప్పారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పలు అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద లబ్దిదారులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో తహశీల్దారు ఉదాశీనత వహిస్తున్నారని, ఇలా కొనసాగితే ఉపేక్షించబోమని అన్నారు. జిల్లాలో 950 గ్రామాలు హైరిస్క్ గ్రామాలుగా ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారని, ఆయా గ్రామాల్లో దశల వారీగా స్ప్రేయింగ్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, గృహ నిర్మాణ సంస్థ పిడి పి.ధర్మచంద్రారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్.విజయ్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు

అక్రమ నిర్మాణాల జోరు.... అడ్డుకునే వాళ్లే లేరు...!

- కాసుల కక్కుర్తితో అక్రమ నిర్మాణాలకి వంత పాడుతున్న అధికారులు

విశాలాంధ్ర - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో గిరిజనేతరులు ప్రభుత్వ భూములపై ఆక్రమణలు చేసి నిర్మాణాలు చేపడితే అధికారులు చర్యలు తీసుకోరా...?. అధికార పార్టీ నాయకులు రెవెన్యూ పంచాయతీ అధికారులు, మీడియా ముసుగులో ఉన్న కొంతమంది అండదండలతో నిర్మాణాలు కొనసాగుతున్నాయని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులు శాశ్వత గృహాలు నిర్మాణాలు చేపట్టరాదని, 1/70 భూబదలాయింపు చట్టం చెప్తున్నప్పటికీ అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకి జోరందుకుంటున్నాయి. రెవెన్యూ పంచాయతీ అధికారులు, కొంతమంది జర్నలిస్టులు రాజకీయ నాయకులు ఏకమై జోరుగా అక్రమ నిర్మాణాలను చేయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూల్చివేతలు చేయకుండా అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి అక్రమ సంపాదనే లక్ష్యంగా అధికారులు ఇక్కడ విధులు నిర్వహించడం సర్వసాధారణంగా మారింది. స్థానికులు ఫిర్యాదులు చేసినా పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులకు కనీసం చీమకుట్టినట్లయినా లేకపోవడం చూస్తుంటే ఎంత భారీ స్థాయిలో లంచాలు మెక్కుతున్నారో అర్థం చేసుకోవచ్చునని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడేరు పట్టణానికి ఆనుకొని తలారిసింగి సమీపంలో శంకర్రావు అనే ఓ గిరిజనేతరుడు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్నాడని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి రెవిన్యూ పంచాయతీ రాజకీయ నాయకులు కొంతమంది జర్నలిస్టులు సహకారంతో నిర్మాణం చేపడుతున్నారని చుట్టుపక్క ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే కాకుండా పట్టణంలో పలు ప్రాంతాల్లో గిరిజనేతరులు నిర్మాణాలు చేపడుతున్న వాటికి కూడా కాసులు తీసుకున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లాస్థాయి రెవెన్యూ అధికారులు పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల పై దృష్టి సారించి, ఎల్‌టిఆర్ కేసులు నమోదు చేయాలని పిసా కమిటీ, వివిధ ప్రజా సంఘ నాయకులు కోరుతున్నారు. ఇకనైనా అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపడతారా.. లేక కాసులకు కక్కుర్తి పడి 1/70 భూ బదలాయింపు చట్టాన్ని తుంగలో తొక్కుతారో వేచి చూడాల్సి ఉంది..

ప్లాస్టిక్ నిషేధానికి వర్తకులు సహకరించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: మన్యంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్క వర్తకులు సహకరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్, మండల రెవెన్యూ అధికారి మాణిక్యం తెలిపారు. శుక్రవారం ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు పరిసరాల్లో పర్యటించే ఈ ప్రాంతంలో వర్తకులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ముఖ్యంగా వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్లు విక్రయించొద్దని హెచ్చరించారు. వాటికి బదులు రెండు లీటర్ల వాటర్ బాటిల్ అమ్మకం చేపట్టాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు జనపనారతో చేసిన సంచులు మాత్రమే వాడాలని తెలిపారు. ముఖ్యంగా హెూటల్స్ రిసార్ట్స్‌లో ఎక్కువగా ప్లాస్టిక్ వాడుతు న్నారని వారిలో కూడా మార్పు రావాలని విస్తరాకులు, స్టీలుతో చేసిన వస్తువులు మాత్రమే వాడాలని తెలిపారు. ఈ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా పంచాయతీ సర్పంచ్ జన్ని అప్పారావు, కార్యదర్శి బి.మోదేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీరం ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని బీరం పంచాయతీ సచివాలయంలో స్థానిక సర్పంచ్ మాధుల రత్నకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీ లోంబోరి అప్పలరాజుతో పాటు పంచాయతీ కార్యదర్శికి శాలువ కప్పి సన్మానించారు. మండల ఎంపీపీగా మా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా అన్ని విధాలుగా అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, కె.బొంజుబాబు, కె.లక్ష్మయ్య, ఎం.సింహాచలం, అప్పారావు, జి.వెంకట్, కె.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతర పందిరి రాట

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రంలో మే 4, 5, 6 తేదీలలో జరిగే శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భంగా శుక్రవారం హుకుంపేట గ్రామం శతకం పట్టు వద్ద పందిరి రాట కార్యక్రమం స్థానిక సర్పంచ్ సమీడ వెంకట పూర్ణిమ, ఉత్సవ కమిటీ అధ్యక్షులు పాంగి అనిల్, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా మోదకొండమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాలకు భక్తులందరూ విచ్చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గోవింద్, వార్డ్ మెంబర్లు వెంకట్, నూకరాజు, పీసా కమిటీ సభ్యులు గోవింద్, నాగమణి, ఉత్సవ కమిటీ సభ్యులు రామకృష్ణ, శివ, సాయిరాం, అనిల్ కుమార్, శివ బాలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో దుక్కిటెద్దు మృతి

విశాలాంధ్ర - కొయ్యూరు: కొయ్యూరు మండలంలో అతి మారుమూల బూధ రాళ్ల పంచాయతీ అన్నవరం గ్రామంలో విద్యుత్ షాక్ కారణంగా గిరిజన రైతు తాంబేల రమేష్‌కు చెందిన విలువైన దుక్కిటెద్దు మృత్యువాత పడింది. బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో వేలాది రూపాయలు విలువ చేసే దుక్కిటెద్దు చనిపోయింది. ఈ దుక్కుటెద్దుపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన రైతు కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. అయితే నిరుపేద గిరిజన రైతు కావడంతో ప్రభుత్వము స్పందించి తాంబేల రమేష్‌కు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు మెంబర్ సంజీవులు ఈ సందర్భంగా కోరారు.

మారుమూల ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని బొయితిలి పంచాయతీ పరిధి గ్రామాల్లో బీసీవై నాయకుడు కిల్లో రాజన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దిగరువు మారుమూల ప్రాంతంలో సీసీ రహదారులు, గృహాలు, తాగునీరు, వంటి మౌలిక వసతుల సమస్యలు అధికంగా ఉన్నాయని అన్నారు.

ఈ ప్రాంతం అధికారులు, పాలకుల చేతిలో విసిరేసిన విస్తరి ఆకుల్లా మారిందని విమర్శించారు. ఆంధ్రా ఒడిశాకు మధ్యలో ఉన్న మద్దిగరువు ప్రాంతాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని రాజన్ డిమాండ్ చేశారు. ఆ దిశగా చర్యలు చేపడితే ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని అభిప్రాయ పడ్డారు. మద్దిగరువుని మండల కేంద్రాన్ని ఏర్పాటుకు అన్ని పార్టీల నాయకులు కలిసికట్టుగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల గౌరవ అధ్యక్షుడు టి.వెంకటరమణ, సన్నిబాబు, కొండబాబు, వెంకన్నబాబు, ఆనంద్, చంద్రకాంత, ఈశ్వరమ్మ, కొండమ్మ, రాజశ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ పర్యటించారు. మండలంలో గల ఎగువ శోభ గ్రామ పంచాయతీని సందర్శించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి తడి చెత్త, పొడి చెత్త సేకరణను పరిశీలించడం జరిగింది. అనంతరం ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేసిన విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఎగువ శోభ గ్రామ పంచాయతీలో అన్ని గ్రామాలకు వెళ్లి పారిశుధ్యం చేయడం సాధ్యపడకపోయినా కనీసం ప్రతి గ్రామంలో చిన్న చిన్న నాడెప్ పిట్లు నిర్మించి అక్కడే చెత్త సేకరణ జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శి సి.హెచ్.దేవాను సూచించారు. ఈ సందర్భనలో పంచాయితీ విస్తరణ అధికారి పీ.ధర్మ రావు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించండి

అరకు ఎంపీ తనూజారాణి

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రజా ప్రతినిధులు అధికారులు ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మా తనూజా రాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల అధ్యక్షురాలు కోరాబు అనూష దేవి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసిన నాడే సమస్యలు పరిష్కారానికి నోచుకునే అవకాశం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మన్యంలో తరతరాలుగా ఉన్న త్రాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు ఆ సమస్య పరిష్కారానికి బాధ్యత తీసుకోవాలన్నారు. అదే క్రమంలో విద్య, వైద్యం, విద్యుత్ తదితర సమస్యలతో పాటు రహదారి, రవాణా, గృహ నిర్మాణాల విషయంలో ఆయా శాఖల అధికారులు గిరిజనులకు మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులకు ఆ సమస్యలపై వారికున్న సందేహాలను నివృత్తి చేసి పరిష్కార దిశగా కృషి చేయాలని సూచించారు. మండల అధ్యక్షురాలు కోరాబు అనుషాదేవి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు రావలసి ఉండగా కిందిస్థాయి ఉద్యోగులను పంపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడచిన సర్వసభ్య సమావేశంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగిందని, రానున్న సర్వసభ్య సమావేశాల్లో కచ్చితంగా మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆమె ఆదేశించారు. జడ్పిటిసి పోతురాజు బాలయ్య మాట్లాడుతూ చింతపల్లి ప్రాంతానికి కళ్యాణ మండపం కావాలని అడిగిన వెంటనే స్పందించి, పార్లమెంట్ నిధుల నుంచి నలభై లక్షలు రూపాయలు నిధులు మంజూరు చేయడం సంతోషకరం అన్నారు. 40 లక్షల రూపాయలు మంజూరు చేసి ఈ ప్రాంతంలో కళ్యాణమండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఎంపికి చింతపల్లి ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లు గోపి నాయక శారద, సాగిన వెంగళరావు, సర్పంచుల పోరం అధ్యక్షురాలు దురియ పుష్పలత, ఎంపీడీవో యు ఎస్ వి శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లీలతోపాటు మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర - సీలేరు: విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో సీలేరు ఏపీ జెన్‌కో జట్టు మూడవ స్థానంలో నిలిచింది. విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను గత మూడు రోజులుగా వీటీపీఎస్ (విజయవాడ)లో నిర్వహించిన పోటీల్లో సీలేరు రాజమహేంద్రవరం జట్టు రెండు సెమీఫైనల్స్‌లో ఓడిపోగా మూడవ స్థానం కోసం సీలేరు రాజమహేంద్రవరం తలపడగా సీలేరు జట్టు 42-17 స్కోర్‌తో రాజమహేంద్రవరం జట్టుపై గెలుపొంది మూడవ స్థానంలో నిలిచింది. సీలేరు జట్టులో ఏడీఈ శ్రీనివాసులును బెస్ట్ రైడవర్‌గా ఎంపికయ్యారు. మూడవ స్థానంలో నిలిచిన సీలేరు జట్టుకు ట్రోఫిని, నగదు బహుమతిని విద్యుత్ స్పోర్ట్స్ కైన్సిల్ అంద జేశారు. సీలేరు జట్టుకు మూడవ స్థానం రావడంతో సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో సూపరిండెంటెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి పలువురు ఇంజనీర్లు అభినందించారు.

స్థాపితం: 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కింది తెలపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
రంపచోడవరం, వై.రామవరం, గంగవరం, అడ్డతీగల.
సంప్రదించవలసిన నెం :
డి.యర్రయ్యరెడ్డి, జిల్లా బ్యూరో చీఫ్
7989138129

ఇష్టపడి చదివితే విజయం మీ సొంతం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: విద్యార్థులు ఎన్ని సంవత్సరాలు చదివారన్నది కాదు ఒకే ఒక్క ఏడాది కష్టపడి, ఇష్టపడి చదివితే విజయం మీ సొంతం అవుతుందని పార్వతిపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రం కొత్తవలస శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు ఆధ్వర్యంలో జరిగిన డిగ్రీ విద్యార్థుల ఫేర్వెల్ డే ఫంక్షన్‌కు ఎమ్మెల్యే విజయచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిగ్రీ అయిపోయిందని ఎవరు ధీమాతో ఉండకూడదని, మీకు చాలా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. డిగ్రీ అయిపోయిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వం చాలా అవకాశాలు కల్పిస్తుంది అన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బిసిల సంక్షేమానికి పెద్దపీట

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే
పూలే జయంతి సభలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాలాంధ్ర - పార్వతీపురం : రాష్ట్ర ప్రభుత్వం మునుపున్నెడు లేని విధంగా బిసిల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. బిసిలకు రక్షణ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయడమే కాకుండా నామినేటెడ్ పోస్టులు, చట్ట సభల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్‌ను కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానిదని ఆమె కొనియాడారు. కలెక్టర్ కార్యాలయంలో మహాత్మా జ్యోతీభా పూలే 199వ జయంతి వేడుకలు బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జెసి ఎస్.ఎస్ శోబిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవలతో కలిసి పూలమాలలను వేసి నివాళులు అర్పించారు. అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పూలే చిత్రపటానికి పూలమాలను వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డా. బాబు జగ్గీవన్ రామ్, జ్యోతీరావు పూలే, డా. బి.ఆర్ అంబేద్కర్ వంటి మహనీయులను ఈ మాసంలో స్మరించుకొని జయంతి ఉత్సవాలను నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. గాంధీ తర్వాత మహాత్మా బిరుదును పొందిన మహెూన్నత వ్యక్తి పూలే అని ప్రశంసించారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు, క్రమశిక్షణ ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన తరుణమిదని పేర్కొన్నారు. అణగారిన వర్గాల వారు కుల వివక్షకు గురయ్యే కాలంలో అలుపెరగని పోరాటం చేసి బిసిల పాలిట ఆరాధ్య దైవం అయ్యారని తెలిపారు. అనంతరం 124 మంది లబ్ధిదారులకు రూ.2కోట్ల 71 లక్షల 50వేల మెగా చెక్కును, వ్యవసాయ, ఇతర పనిముట్లను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేసారు. పీఎంఈజీపి కింద రూ.15 లక్షలు విలువ గల బొలొరా వాహనం, డిజె సౌండ్ సిస్టంను, రూ.1.00 లక్ష విలువైన ఆవును, రూ.50వేల విలువ గల కుట్టు మిషనును మంత్రి లబ్ధిదారులకు అందజేసారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ 2011 సం. జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 49 శాతం మేర నిరక్షరాస్యత ఉందని, కాని ఆ రోజుల్లోనే నిరక్షరాస్యత ఉండరాదని ఆలోచన చేసిన మహెూన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. మగవారితో పాటు స్త్రీలకు కూడా చదువు ఉండాలని, వారి కోసం ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోబిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, వెలమ కార్పొరేషన్ డైరక్టర్ జి.వెంకట నాయుడు, వెలమ సంఘం డైరక్టర్ కె.మధుసూధనరావు, పువ్వల లావణ్య, కాపు కార్పొరేషన్ డైరక్టర్, బిసి సంఘ నాయకులు గబ్బాన సత్తిబాబు, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, బిసి సంక్షేమ అధికారి ఇ. అప్పన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. భాస్కర రావు, జిల్లా వ్యవసాయ, పశు సంవర్ధక శాఖాధికారి కె. రాబర్ట్ పాల్, డా. ఎస్. మన్మథరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం. సుధారాణి, ఇతర జిల్లా అధికారులు, బిసి సంఘ నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుమార స్వామి వార్షిక రథోత్సవం

విశాలాంధ్ర - మోతుగూడెం: జిల్లాలోని వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయితీలోని డొంకరాయి గ్రామంలో కుమార స్వామి వారి 56వ వార్షిక రథోత్సవం కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహిం చారు. ఈ రథోత్సవంలో చుట్టు పక్కల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ కుమార స్వామి వారిని దర్శించుకున్నారు. కుమార స్వామి మాలధారణ వేసిన భక్తులు శూలాలతో శరీరంపై, నాలుకపై, బుగ్గలపై గుచ్చుకొని భక్తిని చాటుకున్నారు. స్వామివారిని రథంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. కమిటీ వారు రథోత్సవానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. డొంకరాయి ఎస్సై శివ కుమార్, సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఎటువంటి అవాంఛనీయ సంఘట నలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

గర్భిణీలకు సామూహిక సీమంతాలు

విశాలాంధ్ర - కురుపాం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతులమీదుగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని జి.శివడ పంచాయతీ రాముడు గూడ బిటి రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి ఐసిడిఎస్ సిడిపిఒ కె.విజయగౌరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతం కార్యక్రమంలో రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాముడు గూడ, జి.శివడ, కీడవాయి గర్భిణులకు సీమంతాలు చేశారు.

పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ

విశాలాంధ్ర - బెలగాం: శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాట యోధుడు, అజ్ఞాత సూరీడు కా. పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ ఈ నెల 13వ తేదీన పలాసలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సందర్భంగా శుక్రవారం పార్వతీపురం బందంవారి వీధిలో ఉన్న అమర వీరుల స్థూపం వద్ద పోస్టర్లు ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా పార్టీ అధికార ప్రతినిధి కా. ఎం.గోపాలం మాట్లాడుతూ ఈ వర్ధంతి సభలో కా. ఎస్. వెంకటేశ్వరరావు, కా. బాలచంద్ర షడంగి, కా. పి.ప్రసాదు, కా. చిట్టిపాటి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని ఈ సభకు పార్టీ జిల్లా కార్యదర్శి కా. తాండ్ర ప్రకాష్ అధ్యక్షత వహిస్తారని, అదేవిధంగా వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. జిల్లా నుండి ప్రజలు, విప్లవ సానుభూతి పొరులు, ప్రగతి శీల శక్తులు ఈ సభలో పాల్గొని విజయవంతం చేయవలసినదిగా కోరారు.

సురక్షిత ప్రసవమే లక్ష్యంగా వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విశాలాంధ్ర - బెలగాం: మాతా, శిశు ఆరోగ్య శ్రేయస్సుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. ఆశా నోడల్ అధికారులకు ఎన్జీఓ హెూంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ భాస్కరరావు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. మాతా, శిశు ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని, గర్భిణీ నమోదు చేసినప్పటి నుండి ప్రసవానంతరం వరకు పూర్తి స్థాయిలో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు, నెల వ్యవధిలో రెండు డోసుల టిడి ఇంజక్షన్స్, ప్రతీరోజూ ఐరన్, కాల్షియం మాత్రలు, నిర్దేశించిన కాల వ్యవధిలో కనీసం నాలుగు తనిఖీలు తప్పనిసరి అని తెలిపారు. గర్భిణీలలో ఆరోగ్య సమస్యలు సత్వరమే గుర్తించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని, సురక్షిత ప్రసవమే ధ్యేయంగా కృషి చేయా లన్నారు. సాధారణ ప్రసవాలు పీహెచ్‌సీల్లో జరిగేలా చూడాలన్నారు. అనంతరం ఆశా కార్యకర్తలకు ఆరోగ్య శాఖ పంపిణీ చేసిన యూని ఫాం (ఏకరూపు దుస్తులను)లను ఆయన ప్రోగ్రాం అధికారులతో కలిసి ఆశలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డా. ఎం. నారాయణరావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డా. రఘుకుమార్, డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి, డిపిఓ లీలారాణి, డిసిఎం విజయలత, డెమో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వేదమంత్రాలతో అయ్యప్ప స్వామి పుట్టినరోజు పూజలు

విశాలాంధ్ర - బెలగాం: కలియుగ ప్రత్యక్ష దైవం కోట్ల మంది భక్తుల ప్రగాడ విశ్వాస పాత్రుడు అన్నదాన ప్రభువు అయ్యప్ప స్వామి పుట్టినరోజు వేడుకల ప్రత్యేక పూజా కార్యక్రమాలు పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల శ్రీ అయ్యప్ప స్వామి వినాయక సుబ్రహ్మణ్య సరస్వతి పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఆలయ నిర్వాహకులు పట్నాయకుని సతీష్, ఆశా రాణి దంపతుల కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అయ్యప్ప సన్నిధానం గురుస్వాములు నాగేశ్వర గురుస్వామి, వై.సంతోష్ గురు స్వామి, సుబ్రహ్మణ్య గురు స్వామీల సహకారం ఆలయ ప్రధాన అర్చకులు నందు స్వామి ఇతర గురుస్వాముల భాగస్వామ్యంతో ప్రత్యేక పూజలను శబరిమల మాలికాపురోత్తమ ఆలయ మున్ మేల్ శాంతి బ్రహ్మశ్రీ వేదమూర్తులైన రెజి కుమార్ నంబూద్రి సౌజన్యంలో శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక వేద పండితులు అయ్యప్ప పాలాభిషేకం, క్షీరాభిషేకం ఇతర ఘట్టాలను భక్తుల సమక్షంలో మరింత ముఖ్యంగా అధిక సంఖ్యలో మహిళలు రాగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని తరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు 2000 మందికి పైబడి భక్తులకు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేయగా భక్తితో ప్రసాదాన్ని స్వీకరించి తరించారు. కార్యక్రమంలో సన్నిధాన గురుస్వాములు గొట్టాపు వెంకటరమణ, స్వామి, పళ్లెం రాజు, కర్రి ఫకీర్ స్వామి, గంటా శ్రీను, స్వామి సాయి స్వామి, సింహాచలం స్వామి, సత్యానందరావు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే బోనెల

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలు పూర్తిగా మర్చిపోయారని, కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలు ఇప్పుడే చూస్తున్నారని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. జిల్లా కేంద్రంలో గల కొత్తవలస శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వి.ఎం.ఉష పథకం కింద రూ.500 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన ప్రభుత్వ బాలికల వసతి గృహం నిర్మాణానికి ఎమ్మెల్యే విజయ్ చంద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ చంద్ర మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టి స్వలాభాలకు ప్రోత్సహించిందని, అందుకే పార్వతీపురం మన్యం జిల్లా వెనుక పడిందని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని, అందులో భాగంగానే వసతి గృహాల నిర్మాణాలను చేపడుతుందన్నారు. వెనుకపడ్డ పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ బాలికల వసతి గృహాన్ని రెండేళ్లలో పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎస్వీడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావును ఆయన కోరారు. ఎస్‌విడి కళాశాలను మోడల్ కళాశాలగా తీర్చిదిద్దరమే ధ్యేయంగా ప్రిన్సిపాల్ చలపతిరావు పని చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పూలే సేవలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: జ్యోతీరావు పూలే సేవలు వెలకట్టలేనివని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఈఎస్‌కే దుర్గ అన్నారు. స్థానిక డిపో ఆవరణలో శుక్రవారం జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బి.అప్పారావు ఆధ్వర్యంలో పివి రమణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిపో మేనేజర్ ఎస్.కె దుర్గ, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మరిపి శ్రీనివాసరావు, ఎన్ఎంయుఏ జిల్లా కార్యదర్శి కే.శంకర్రావు తదితరులు మాట్లాడుతూ పూలే, సావిత్రిబాయి అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. మహిళలకు విద్యా హక్కుల కొరకు ఆ రోజుల్లోనే పోరాటం చేశారని మనం కూడా అటువంటి మహ నీయులను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. ఆ రోజుల్లో నిరక్షరాస్యత ఉండరాదని ఆలోచన చేసిన మహెూన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కె.సుమిత్ర, అసిస్టెంట్ ఇంజనీర్ బిఎస్ రావు, కత్తిరి నరసింహారావు, సాహు, ఫైనాన్సు విభాగ అసిస్టెంట్ మేనేజర్ బి.రామారావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కురుపాం: స్థానిక శ్రీ ధర్మశాస్త అయ్యప్ప దేవాలయం లో శుక్రవారం ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కురుపాంకి చెందిన వద్ది మన్మథరావు గణపతి ,సుబ్రహ్మణ్యం, అయ్యప్పస్వామిలకు వెండి కిరీటాలు బహుకరించారు. వేదపండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మద్యాహ్నం వందలాది మంది కి అన్నదానం చేపట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను నామసంకీర్తనలుతో తిరువీధి చేపట్టారు.

రేగిడి పాఠశాలలో పరిణామాలపై
సమగ్ర విచారణ జరపాలి

విశాలాంధ్ర - బెలగాం: గుమ్మలక్ష్మీపురం మండలం రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్యం పేరిట పురుష ఉపాధ్యాయులు గిరిజన బాలికలను బయటకు ప్రైవేట్ ఆసుపత్రికి, ఆర్ఎంపి డాక్టర్ల వద్దకు తీసుకుని వెళ్లారన్నా ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం, ట్రైబల్ రైట్స్ ఫోరం, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, పార్వతీపురం ఐటిడిఎ పిఓ అసుతోష్ శ్రీ వాస్తవ్‌కు వేరువేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్ల సరేష్, ముచ్చల అమర్నాధ్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికిప్పల రామకృష్ణ, చెల్లూరు సీతారాం, కోలక గౌరమ్మ, బి.రవికుమార్, బిటి నాయుడు మాట్లాడుతూ బాలికల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులను నియమించడమే అనేక సమస్యలకు కారణమన్నారు. రేగిడి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, మహిళా డిప్యూటీ మెట్రీన్ ఉండగా పురుష ఉపాధ్యాయులు బాలికలను వైద్యం పేరిట బయటకు ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నించారు. విచారణ సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధానోపాధ్యాయుడు, పురుష ఉపాధ్యాయులు పాఠశాలలో లేకుండా విచారణ జరపాలని అప్పుడే పాఠశాలలో ఏం జరిగిందో వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

సీతానగరం మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని 35గ్రామపంచాయతీల కార్యదర్శులు కలిసి శుక్రవారంనాడు మండల పరిషత్ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడుగా రామవరం పంచాయతీ కార్యదర్శి ఆదిమూలం శశిభూషణ్ రావు, వైస్ ప్రెసిడెంటుగా బగ్గందొరవలస పంచాయితీ సెక్రటరీ కర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణారాయపురం కార్యదర్శి జి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా గాదెలవలస కార్యదర్శి బడే మనోహర్, కోశాధికారిగా పెదంకలం కార్యదర్శి గౌరీశ్వరి, గౌరవ అధ్యక్షులుగా చినబోగిలి పంచాయతీ కార్యదర్శి పెంట తిరుపతిరావులను కార్యదర్శులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గాన్ని ఎంపిడిఓ పి త్రివిక్రమరావు, మండల పంచాయతీ విస్తరణఅధికారి కె కుమార వర్మ, ఏవో ఎంఎల్ఎన్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు , మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది అభినందించారు.

మహిళా స్నేహపూర్వక గ్రామపంచాయతీగా ఎంపిక

విశాలాంధ్ర - సీతంపేట: గ్రామపంచాయతీ స్థాయిలో గల అన్ని లైన్ డిపార్ట్మెంట్ వారికి ప్రతి నెల చేయవలసిన కార్యక్రమాల గురించి అవగాహన గ్రామసభ నిర్వహిం చారు. కార్యక్రమంలో మహిళలు అన్ని రంగాలలో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సాధికారత స్వావలంబన సాధించిన రోజే నిజమైన మహిళ స్నేహ పూర్వక గ్రామపంచాయతీగా సీతంపేట వర్ధిల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఐ ఆర్డి కన్సల్టెంట్ కే.నాగ రాజు, డిఎల్‌పిఓ రాంప్రసాద్, డిఎల్‌డివోయు గోపాలకృష్ణ, ఎంపీడీవో తాడంగి కృష్ణారావు, ఈవోపిఆర్డి కే.సత్యం, పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ, సర్పంచ్ అరిక కళావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఎక్సైజ్ దాడులు

విశాలాంధ్ర - సీతంపేట: శ్రీకాకుళం జిల్లా కొత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సిబ్బందితో కలిసి, పార్వతీపురం మన్యం జిల్లా ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు ఆదేశాల మేరకు సీతంపేట మండలంలో గల సుందరయ్య గూడ గ్రామంలో దాడులు నిర్వహించారు. సుందరయ్య గూడకు చెందిన పూయక మురళి, బిడ్డిక ఆదినారాయణ, పూయక సంజీవరావు అరెస్టు చేసి వారి వద్ద నుండి 870 లీటర్లు నాటు సారాని స్వాధీనం చేసుకొని నాటు సారా తయారీకి ఉపయోగించబడే బెల్లం పులుపు 1250 లీటర్లు ధ్వంసం చేసినట్టు తెలిపారు. వారికి బెల్లము సప్లై చేసిన కొత్తూరు మండలంలో గల లబ్బ గ్రామంనకు చెందిన బెల్లపు వ్యాపారి జామి సురేష్‌పై కూడా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏఎస్ దొర, పాలకొండ మొబైల్ పార్టీ సిఐ మురళి, కొత్తూరు సిఐ కిరణ్మయి, పాలకొండ ఎస్సైలు జి.ఫణీంద్రబాబు, ఎల్.తిరుపతిరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.

పాఠశాలలో చేర్పుల కోసం ఉపాధ్యాయులు ప్రచారం

విశాలాంధ్ర - సీతానగరం: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మా పాఠశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో కార్యక్రమంలో భాగంగా కొత్తవలస మామిడి, మామిడి, కరా సవలస, కందుల పదం, పావడవలస గ్రామాలను సందర్శించి విద్యార్థుల ను చేరమని ప్రభుత్వం అన్ని సౌకర్యంలు కల్పిస్తుందని హాస్టల్ లో సుచి శుభ్రతా ఉంటుందని తెలియజేసి వారిని ప్రోత్సాహించడం జరిగినది. గత సంవత్సరం వలె అందరూ ప్రవేశం పొందుతామని ఈ నెల 21వ తేదీన వచ్చి చేరుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రదా నోపాధ్యాయులు వాలేటి తవిటి నాయుడు కె. రమేష్ టి. అనసూయ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లు నిలుపుదల చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: అక్రమ సస్పెన్షన్‌లు, రిమూవల్స్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్టీసీ గేటు వద్ద ఏపీపీటీడీ ఎన్ఎంయు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రీజనల్ కార్యదర్శి కెఎస్ రావు, డిపో కార్యదర్శి కేబి రాజు మాట్లాడుతూ గత నాలుగు సంవత్స రాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని, పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనాలని, నైట్ అవుట్ అలవెన్స్‌లను 150 నుంచి 400 వరకు పెంచాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని, పారదర్శకమైన ట్రాన్స్‌ఫర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు, కండక్టర్లు కార్మికులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యల పరిష్కారానికి

నిధులు మంజూరు చేయండి

పార్లమెంటు సభ్యురాలు తనూజారాణి దృష్టికి మండల సమస్యలు

విశాలాంధ్ర - చింతపల్లి: గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ మతాలకు చెందిన ప్రముఖులు అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మా తనూజరాణిని కోరారు. ఈ మేరకు సర్పంచ్ లు, ఎంపిటిసి లతో పాటు ఆయా సంఘాల ప్రతినిధులు దరఖాస్తులను ఆమెకు అందజేశారు. మండలంలో ప్రధానంగా త్రాగునీరు, రహదారి, రవాణా సౌకర్యం, గృహాలు మంజూరుతో పాటు, వివిధ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. అదే విధంగా స్థానిక క్రైస్తవ సంఘాలకు చెందిన ప్రతినిధులు గ్రామంలోని క్రైస్తవ శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని వినతి పత్రం సమర్పించగా, ముస్లింలు మహిళలు నమాజ్ ఆచరించేందుకు సామాజిక భవనం మంజూరు చేయాలని కోరారు.ఇదే క్రమంలో హిందువులు హిందూ స్మశాన వాటిక వద్ద దహన సంస్కారాలు నిర్వహించే స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అన్ని పంచాయతీల సర్పంచులు ఎంపీటీసీలు తమ తమ పంచాయతీలలో త్రాగునీరు సిమెంటు రహదారుల కల్పనకు కృషి చేయాలని వినతి పత్రాలు అందించారు. అనంతరం పార్లమెంట్ సభ్యురాలు తనుజారాణిని దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, అన్ని పంచాయతీల ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ముస్లిం, క్రిస్టియన్, హిందూ మతస్తులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

విశాలాంధ్ర - పార్వతీపురం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, మహిళాభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి అయిన మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సంధర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో శు క్రవారం జ్యోతీరావ్ పులే చిత్రపటానికి జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గొప్ప సంఘ సంస్కర్త, విద్యావేత్త మరియు ఆలోచనాపరుడు, మహిళాభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి శ్రీ జ్యోతీరావ్ ఫులే అని కొనియాడారు. ఆయన 1827 ఏప్రిల్ 11వ తేదీన మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారని, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడని, 1873 సెప్టెంబరు 24న, ఫులే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి "సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్)"ను ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి శ్రీ జ్యోతీరావ్ ఫులే అని అన్నారు. మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించాలనే లక్ష్యంతో అతని భార్య సావిత్రిబాయి ఫులేతో కలిసి 1848లో పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించారని, వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించారని, 1864లో దేశంలోనే మొట్టమొదటి "బాలహత్య ప్రతిబంధక్ గృహం" స్థాపించి, వితంతువులైన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడన్నారు. 1888లో ముంబైలో జరిగిన ప్రముఖ సభలో ఆయనకు 'మహాత్మ' అనే గౌరవబిరుదు లభించిందన్నారు. ఆయన రచించిన ప్రముఖ గ్రంథాలలో "గులాంగిరి" 'సార్వజనిక్ సత్యధర్మ పుస్తక్" ప్రముఖమైనవిగా నిలిచాయన్నారు. ఆయన జీవితం, తత్వం, నైతిక విలువలు ఈ రోజుకీ అనేకరులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అలాంటి మహానుభావుడి సేవలను స్మరించుకుంటూ, ఈ తరానికి ఆయన జీవితం ఆదర్శంగా నిలవాలని, మనమంతా ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ ఆర్ఐలు రాంబాబు, నాయుడు, ఆర్ఎస్సైలు, ఎస్బీ, డిసిఆర్బి అధికారులు, సిబ్బంది మరియు స్పెషల్ పార్టీ, పోలీసు కార్యాలయం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించాలి

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రామినాయుడు

విశాలాంధ్ర - బెలగాం: ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ద్వారా ఉపాధ్యాయులు అవకాశం ఉన్నా కోరుకున్న చోటికి పోలేకపోతున్నారని కావున గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెచ్చిన మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారానే జరపాలని పీఆర్‌టీయూ ఎపి రాష్ట్ర కార్యదర్శి జక్కు రామినాయుడు అన్నారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ బదిలీలలో సీనియర్ ఉపాధ్యాయులకు సర్వీస్ పాయింట్లు సంవత్సరానికి (1) ఒకటి ఇవ్వాలని, రిటైర్మెంట్ మూడు సంవత్సరాలు ఉన్న వారిని బదిలీల నుండి మినహాయించాలని, ఒంటరి మహిళలకు ప్రిఫరెన్షి యల్ కేటగిరి కేటాయించాలని, ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయు ఉపాధ్యాయులకు బదిలీలలో అదనంగా ఐదు స్పెషల్ పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇవేమీ కూడా ఆర్థిక అంశాలు కావని, ప్రభుత్వానికి ఏమాత్రం భారం పడదని అన్నారు. ప్రతి శు క్రవారం ఉపాధ్యాయ సంఘాలతో మీటింగ్ పెట్టి మెజారిటీ సంఘాల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమని అదీగాక అన్ని కూడా సంఘాల అభిప్రాయాల మేరకే తీసుకున్నామని చెప్పడం కూడా బాధాకరమని వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేనట్లయితే పీఆర్‌టీయూ ఎపి భవిష్యత్ కార్యాచరణ చేపడుతుందన్నారు.

విశాలాంధ్ర

పేజి: 3

అల్లూరి సీతారామరాజు

పార్వతీపురం మన్యం

శనివారం 12, ఏప్రిల్ 2025

మారుమూల ప్రాంతాలలో పర్యటించిన ఓఎస్డీ

విశాలాంధ్ర - మోతుగూడెం: బొడ్డగండి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బొడ్డగండి, కల్లెపుగొంది, నాగలోవ, అంటిలోవ, రాకోట గ్రామాలలో రంపచోడవరం ఓఎస్డీ జగదీష్ ఆడహల్లి పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, గ్రామ సమస్యలను తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జగదీష్ హడహల్లి మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి జరగాలంటే అధికారులు రావాలని, అధికారులు రావాలంటే మావోయిస్టులు ఉండకూడదని అప్పుడే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. అధికారులు వస్తేనే రోడ్లు, పక్క గృహాలు, నీటి సదుపాయాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. మావోయిస్టులు రావడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. మావోయిస్టుల గురించి ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే తెలియజేయాలని కోరారు. యువత బాగా చదువుకొని ఉద్యోగాలు సంపాదిస్తే గిరిజన గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. యువతకు ఏటువంటి సమస్య వచ్చిన అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. గ్రామ సమస్యలను పీఓ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు తెలియజేశారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉండాలని, పోడు వ్యవసాయం ప్రైవేటు ఉద్యోగాలపై ఆసక్తి పెంచుకోవాలని అప్పుడే అభివృద్ధి చెందుతుందని అన్నారు.

అనంతరం గ్రామ యువతకు వాలీబాల్ కిట్లు, చదువుకున్న పిల్లలకు పుస్తకాలు పెన్సిల్ కిట్లు బిస్కెట్లు చాక్లెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో గుర్తేడు ఎస్సై పార్థసారథి, డొంకరాయి ఎస్సై శివకుమార్ పాల్గొన్నారు.

పోషణ పక్వాడలో ఆరోగ్య సూత్రాలపై అవగాహన

విశాలాంధ్ర - కొయ్యూరు: పోషణ పక్వాడ కార్యక్రమం అనేది భారత ప్రభుత్వం చేపడుతున్న పోషణ అభియాన్‌లో భాగంగా నిర్వహించే ఒక ప్రత్యేక కార్యక్రమం అని కొయ్యూరు ఐసిడిఎస్ సిడిపిఓ విజయకుమారి తెలిపారు ఇది ఐ సీ డి ఏస్ ద్వారా అమలవుతుంది. ఐ సీ డి ఏస్ ద్వారా బాలల ఆరోగ్యం, పోషణ, మరియు శిశు అభివృద్ధి కోసం పనిచేసే ప్రభుత్వం యొక్క ఒక ముఖ్యమైన పథకం. అని పోషణ పక్వాడ సమయంలో, అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి అని అన్నారు. పోషకాహారపు డెమోలు, తల్లి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, పోషణపై వర్క్‌షాపులు స్థానిక సాంప్రదాయాలకు అనుగుణంగా ఆరోగ్యకరమైన ఆహారం గురించి సూచనలు సామూహికంగా ప్రజలతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ప్రజల్లో పోషకాహారంపై చైతన్యం కలిగించడమే ముఖ్య లక్ష్యం. కాగా ఈ కార్యక్రమం సీడీపీఓ పి.విజయకుమారి ఆధ్వర్యంలో నేడు మర్రిపాలెం, ధర్మవరం కేంద్రంలో నిర్వహించినట్టు సీడీపీఓ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పోషణ ఆరోగ్య విషయాలపైన లబ్ధిదారులకు అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. 1000 రోజులు అనగా గర్భస్థ దశ నుండి పిల్లవాడికి రెండేళ్లు వచ్చేవరకు మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు పోషణ గురించి వివరించా మన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సునీత, కొండమ్మ, కార్యకర్తలు హాజరయ్యారు అని అన్నారు.

చిట్టెంపాడులో పల్లెకు పోదాం

విశాలాంధ్ర - కొయ్యూరు: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరిశ్వరి పిలుపుమేరకు మండలంలో శుక్రవారం చిట్టెంపాడులో పల్లెకి పోదాం కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు సంపరి శివ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర బిజెపి పార్టీ నాయకులు గాది శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలుతో శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయ కత్వంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వాటన్నింటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం ప్రధానమంత్రి నరేంద్రమోడీతోనే సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మన్య ప్రాంతంలో పీఎం జన్మన్ నిధులతో ప్రతి మారుమూల గ్రామానికి బీటీ రోడ్లు నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా గిరిజనులు ఎవరు అనారోగ్యాలు బారిన పడకుండా ఉండేందుకు జెల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వం హాయములో రాష్ట్రంలో ఎన్నడు జరగని అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఒనుముల మల్లేష్, చిన్న రాజు, వనిమెల స్వామి నాయుడు, గ్రామస్తులు బిజెపి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.